యువ: ఏప్రిల్, 1984

# గాలి - నీరు - శబ్దము

"డాక్టరుగారూ! మా బాబుని చూడండి! ఎలాగైనాడో?"

డాక్టరు విశ్వరూపం బాబుని చూశాడు, అతని తల్లి భూదేవి ఆత్రుత, ఆందోళన గమనించాడు.

"అసలేం జరిగింది?"

భూదేవి చెప్పింది.

"బాబుకు నీళ్ళు పోశాను. పౌడరద్దాను. లాగు చొక్కా వేశాను. కాళ్ళకు సాక్స్ తొడిగాను. బూట్లు వేశాను!"

"ఊ! తర్వాత?"

"అడుకో బాబూ అని పంపాను!"

"ఎక్కడకూ?"

"సుందర నందనోద్యానవనానికి."

:: 2 ::

సుందర నందనోద్యానవనము! ప్రాతఃకాలం! సూర్యుని లేత బంగారు కిరణాలు చెట్ల మీద, విరిసిన మొగ్గల మీది మంచుబిందువుల మీద, ఎగిరే పంచెవన్నెల సీతాకోక చిలుకల మీద, ఆకులో ఆకుగా, పూవులో పూవుగా వున్న చిరు రెమ్మల పైన, ఆకుపచ్చని చీర ధరించిన నేల మీద పడుతున్నాయి.

బాబు ముద్దుగా వున్నాడు అనడం కంటే అప్పుడే పూచిన మల్లెపువ్వులా వున్నాడు అనడం సబబు. అడుగులో అడుగు వేసుకుంటూ, ప్రకృతి ప్రసాదించిన వన్నెచిన్నెలు చూస్తూ ఆనందిస్తున్నాడు. ముగ్ధమనోహరమైన ప్రకృతి ఒడిలో అందాల పాప - ఆ బాబు!

నల్లని మేఘం లాగా, పొగ - ఫ్యాక్టరీ గొట్టాల నుంచీ, యంత్రాల నుంచీ, మోటారు వాహనాల నుంచీ కాదు! యావత్ నాగరికతా ప్రపంచం నుంచీ... పొగ, దుమ్ము, ధూళి ప్రకృతి అంతా వ్యాపించింది.

బాబును సుడిగాలిలా, పెనుతుపానులా పొగ చుట్టేసుకుంది. స్వచ్ఛమైన ప్రాణ వాయువు, వాటిని ప్రసాదించిన తల్లి, తండ్రీ అయిన ప్రకృతి కూడా కారు నలుపులా, కేన్సర్ రోగిలా అయిపోయినాయి. ఇక బాబు సంగతి వేరే చెప్పాలా!

"ఊ తర్వాత."

"బాబు నల్లగా అయిపొయ్యాడు. డాక్టర్! ఆ నలుపు తాత్కాలికమేనని, బాబుని

ఊరు దగ్గరలోగల పుణ్యనది దగ్గర ఆడుకోమని పంపాను!"

"ఏమైంది?"

:: 3 ::

అది పుణ్యనది. శంభుని శిరంబు నుండి, హిమాచలం మీదకు వచ్చి, కన్నెపిల్లగా పెరిగి, భగీరథుని వెంట, ఎండి బీటలు వారిన భూమాత ఆర్తిని తీర్చేందుకు, సకల జనావళికి భోగభాగ్యాలు, ధనధాన్యాలు ఇచ్చేందుకు అవతరించిన పుణ్యనది. ఆ నదిలో ఎందరో పునీతులయ్యారు! వేదంలా ఆ నది భూతకాలం నుంచి భవిష్యత్తులోకి ప్రవహిస్తున్నది.

బాబు ఆ నదీ జలాలను చూచి, బంగారు రజనులా వున్న ఇసుక రేణువులను చూచి సంతోషపడ్డాడు. ఆశగా, ఆబగా, ఆ అమృతాన్ని తనివితీరా త్రాగాలని ముందుకెళ్ళాడు.

దోసెడు నీటిలో... మరకలు, మాలిన్యాలు... పురుగులు, శవాలు, మలం, మూత్రం ఒకటేమిటి.. ఎన్నో... ఆ నీరు త్రాగిన బాబు???

:: 4 ::

"జ్వరమైంది! ఆ తర్వాత?"

"డాక్టర్‌గారు! నా బాబు ఆడుకునేందుకు, పాడుకునేందుకు ఈ భూమ్మీద చోటే దొరక్క..." భూదేవి గొంతు గద్గదమైంది.

"చెప్పమ్మా..."

"బాబును ఇల్లు కదలొద్దురా అని చెప్పాను ... కానీ..." భూదేవి మొహం బాధతో, నిస్సహాయతతో వుంది.

"కానీ గదిలో ఒంటరిగా క్షణం వున్నాడో, లేదో వాడికేం వినపడడం లేదని గ్రహించాను."

"ఎందువల్లో గుర్తించావా అమ్మా?"

"తెలియదు."

"నిశ్శబ్దాన్ని మించిన సంగీతం లేదని సామెత! ఆధునిక ప్రపంచంలో నిశ్శబ్దం కరువైంది! మోత... యంత్రాలు! ఫ్యాక్టరీలు... విమానాలు.. అరుపులు.. ఆందోళనలు.. ఉపన్యాసాలు.. ఒహ్!"

"డాక్టర్‌గారూ మా బాబు... చూడండి ఎలా అయినాడో... జుత్తు నెరసింది! కళ్ళకు అద్దాలొచ్చాయి. పళ్ళు వూడిపోయ్యాయి! నడిచేందుకు కర్ర ఊతం కావాలి! తింటే అరగదు! జబ్బు! వీటితో అరవైయేళ్ళ వాడిలా అయ్యాడు... వీడికి విముక్తి లేదా డాక్టర్?"

ఆ తల్లి వేసిన ప్రశ్నలో.... కోట్లాది మానవుల ఆక్రందన, ఆందోళన, ఆవేదనా వున్నాయి?

కానీ! ఏదీ జవాబు?

డాక్టర్ విశ్వరూపం తలొంచుకున్నాడు. ♦